## మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలి

పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా చూడాల్సిన బాధ్యత సెక్టార్ అధికారులదే

కలెక్టర్ అనురాగ్ జయంతి



2లో


# మనం కరీంనగర్

జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

ఆదివారం | 1 | అక్టోబర్ | 2023 | పేజీలు : 6


# మంచిర్యాలలో పెరుగుతున్న అక్రమ కట్టడాలు

ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ముందు రాత్రికి రాత్రే వెలిసిన షట్టర్లు

చోద్యం చూస్తోన్న అధికారులు



మంచిర్యాల, సెప్టెంబర్ 30 (మనం న్యూస్): మంచిర్యాల జిల్లా ఏర్పాటైన అనంతరం జిల్లా కేంద్రంలో అక్రమ కట్టడాలు పెరిగిపోతున్నాయి. ఖాళీ స్థలాలు కనిపించాయం టే చాలు.. రాత్రికి రాత్రే కట్టడాలు వెలుస్తున్నాయి. అక్రమ కట్టడాలు, కబ్జాలను నియంత్రించాల్సిన మున్సిపల్ శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న అపవాదును ఎదుర్కొంటున్నారు. దీంతో కబ్జాదారులు కోరలు చాచి కనిపించిన స్థలాన్ని కాజేస్తున్నారు. తాజాగా పట్టణంలో మిగతా 2లో..



2లో


## బిజెపికి సోమారపు సత్యనారాయణ రాజీనామా

- స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి సిద్ధం
- రామగుండం అభివృద్ధే తమ ఎజెండా
- మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ

## దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి గంగుల కమలాకర్

30 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 30 (మనం న్యూస్): దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బిసి సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం అంబేద్కర్ స్టేడియంలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్, అలీం కో సహకారంతో నిర్వహించిన మిగతా 2లో..



## ఉసేన్ బోల్ట్ స్ఫూర్తిగా క్రీడల్లో అద్భుత విజయాలు సాధించాలి

కరీంనగర్ కలెక్టర్ గోపి

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 30 (మనం న్యూస్): ట్రాక్ ఆండ్ ఫీల్డ్ చరిత్రలో గొప్ప అథ్లెట్లలో ఒకరిగా కీర్తి గడించిన ఉసేన్ బోల్ట్ ను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించి అద్భుత విజయాలను సాధించాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని రీజనల్ స్పోర్ట్ స్కూల్ లో 14,16,18, 20 సంవత్సరాల లోపు బాల, బాలికలు, పురుషులు, మహిళలకు నిర్వహించిన 9వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సిపి, ఎసిఎల్బిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

# మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ పై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలి



సిరిసిల్ల అర్బన్, సెప్టెంబర్ 30 (మనం న్యూస్)ః భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూలు ప్రకటన తోనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్టు అమల్లోకి రానున్నందున ఇప్పటినుంచే ఎస్ఎస్ టి, ఎఫ్ ఎస్ టి, వివిటి, వి ఎస్ టి, ఎంసీఎంసీ బృందాలు ఎంపీసీ పై అవగాహన పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి బృంద బాధ్యులకు సూచించారు. తద్వారా శనివారం ఐడిఓసి కార్యాలయంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సెక్టార్ ఆఫీసర్‌లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్‌లు, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి, వివిటి, విఎస్‌టి, ఎంసీఎంసీ బృందాల సభ్యులకు ఎన్నికల విధులపై మాస్టర్ ట్రైనర్‌లతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన వెంటనే మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ ను పాటించడం, అమలు చేయడం ఉద్యోగుల బాధ్యత అన్నారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణం లో పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా ఉండేందుకు అధికారులు 100 శాతం న్యూట్రాలిటి పాటించాలని చెప్పారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పై పూర్తి అవగాహన కలిగి ఉండి షెడ్యూల్ విడుదలైన వెంటనే బృందాలు తమ పని ప్రారంభించాలన్నారు. ఇందుకు సంబంధించిన మెటీరియల్ ను కూడా అందరికీ పంపిణీ చేస్తామని చెప్పారు. షెడ్యూల్ వచ్చిన వెంటనే తమ కార్యకలాపాలకు సంబంధించి రిపోర్ట్ ను ఎప్పటికప్పుడు బృందాలు పంపించాల్సి ఉంటుందన్నారు ఎలక్షన్ ప్రచార కార్యక్రమాలకు సంబంధించి రాజకీయ పార్టీలు సువిధ ఆప్ ద్వారా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. షెడ్యూల్ వచ్చిన 24 గంటల లోగా ప్రభుత్వ స్థలాలు, భవనాల పై ఉన్న రాజకీయ పార్టీల గుర్తులు, పోస్టర్ లు, వాల్ రైటింగ్, బ్యానర్ లు తొలగించాలని చెప్పారు. ప్రైవేట్ స్థలాలలో రాజకీయ పార్టీల గుర్తులు, పోస్టర్ లు, వాల్ రైటింగ్, బ్యానర్ లు ఉంటే వాటి యజమాని అంగీకార పత్రం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సెక్టార్ పరిధిలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిక్కచ్చిగా అమలయ్యేలా , ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా చూడడంలో సెక్టార్ ఆఫీసర్ లు కీలకంగా వ్యవహరించాలని కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం భారత దేశమని , ఇక్కడ ఎన్నికల క్రతువును పారదర్శకంగా నిర్వహిస్తారన్న పేరు, నమ్మకం అధికారులకు ఉందన్నారు. దానినీ బాధ్యతతో మరింత ముందుకు తీసుకువెళ్ళాలని చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ కు ముందే అన్ని బృందాల సభ్యులకు తమ విధులు బాధ్యతలు మోడల్ కూడా కండక్టు గురించి వాటిలో వచ్చే అంశాల గురించి సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అలర్ట్ గా ఉండి షెడ్యూల్ రాగానే ఎన్నికలు సజావుగా జరిగేందుకు వెంటనే తమ పనిని అధికారులు ప్రారంభించాలన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్ఎస్ టి, ఎఫ్ ఎస్ టి, వివిటి, వి ఎస్ టి, ఎంసీఎంసీ సభ్యులకు ఎంపీసీ పై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీఓలు ఆనంద్ కుమార్, మధుసూదన్, డిఎస్పీలు ఉదయ్ రెడ్డి, నాగేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో పౌర హక్కుల దినోత్సవం



తిమ్మాపూర్, సెప్టెంబర్ 30 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో సర్పంచ్ ఇనుకొండ జితేందర్ రెడ్డి అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రప టానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. అనంతరం మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ అక్బర్ మాట్లాడు తూ గ్రామ ప్రజలకు రెండంచెల పద్ధతి పై అవగా హన కల్పించారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండా లని, దళితుల పట్ల అమానుషంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపట్ల చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి పోలీస్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. అంతే కాకుండా ఏమైనా భూ సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారులను కలిసి పరిష్క రించు కోవాలని, ప్రతి ఒక్క దళిత బిడ్డలు శ్రద్ధగా చదువు కోవాలని, చదువుతూనే సమాజంలో గొప్ప స్థానాల్లో ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంపీఓ కిరణ్ కుమార్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు పారునంది జలపతి, ఐకెపి ఎపిఎం రామ్మోహన్, ఏపీవో లలిత పంచాయతీ కార్యదర్శి అరుణ్, దళిత సంఘాల నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉసేన్ బోల్ట్ స్పూర్తిగా క్రీడల్లో అద్భుత విజయాలు సాధించాలి

మొదటి పేజీ తరువాయి..

కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 1 వరకు జరగనున్న ఈ పోటీలలో తెలంగాణలోని 33 జిల్లాల నుండి 1250 క్రీడాకారులు పాల్గొనడం గొప్పవిశేషమని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఆసియా క్రీడల్లో పాల్గొంటున్న భారత క్రీడాకారులు ప్రతి విభాగంలో వరుసగా విజయాలను సాధిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం సమున్నతంగా గౌరవిస్తు వారికి మంచి గుర్తింపును, సహాయ సహకారాలను అందిస్తుందని తెలిపారు. సిపి సుబ్బారాయుడు మాట్లాడుతూ ఆటల్లో గెల వాలనే లక్ష్యంతో ఉత్సాహంగా పాల్గొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. కష్టం, క్రమశిక్షణ, కఠోర శ్రమతో కృషి చేసి మున్ముందు మరిన్ని అద్భుతాలను సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం 18 సంవత్సరాల బాలికల విభాగంలో 3కేజి షాట్ పుట్ లో గెలుపొందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యం. సంగీత కు స్వర్ణం, మహబూబాబాద్ జిల్లా కు చెందిన ఏ. హారిక సిల్వర్, ఖమ్మం జిల్లాకు చెందిన పూజితకు బ్రౌంజ్ లను అదేవిధంగా పురుషుల విబాగంలో గద్వాల జిల్లాకు చెందిన జి. వెంకటేశ్ స్వర్ణం, సిద్దిపేట జిల్లాకు చెందిన షేఖ్ మహబూబ్ కు సిల్వర్, నిజామాబాద్ జిల్లాకు చెందిన యం. అశోక్ రెడ్డి లకు కలెక్టర్, సిపి లు బహుమతులున ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అర్జున అవార్డు గ్రహిత జె. శోభ, అంతర్జాతీయ క్రీడాకారులు కల్పనారెడ్డి, నాగమణి, డివై ఎస్ఓ రాజవీర్, టిఎఎ అధ్యక్షులు స్థాన్లీ,సెక్రటరి సారంగపాణి, రాజేష్, మహిపాల్ రెడ్డి, పిఇటిలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని 42 వేల రూపాయల విలువైన బ్యాటరీ ట్రై సైకిళ్లను 30 మంది దివ్యాంగులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. వికలాంగులకు రూ.4000 వేల పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో దివ్యాంగులకు మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ గోపి, నగర మేయర్ వై.సునీల్ రావు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డ వేణి మధు, ఫ్యాక్స్ చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డి, కమల మనోహర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఎంపిటిసి సభ్యులు బుర్ర తిరుపతి గౌడ్, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ సాబీర్, చల్ల హరి శంకర్, సిడిపిఓ ఉమారాణి, అలీం కో ఇంచార్జ్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## కేటాయించిన విధులను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలి

### రాజస్వ మండల అధికారి రాములు



మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 30 (మనం న్యూస్)ః ఎన్నికల నిర్వహణలో కేటాయించిన విధులను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని రాజస్వ మండల అధికారి, ఓటరు నమోదు అధికారి రాములు తెలిపారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయంలో మంచిర్యాల నియోజకవర్గానికి సంబంధించిన సెక్టోరల్ అధికారులు, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు లోబడి అధికారులకు కేటాయించిన విధులను ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి రోజు నివేదికలు, వనరబులిటీ మ్యాపింగ్ 1, 2, 3, ఎ.ఎం.ఎఫ్. నివేదిక, సెక్టారుకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి కేంద్రాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, ఇతర భద్రతా చర్యలను పరిశీలించి నివేదికలను అక్టోబర్ 3వ తేదీ లోపు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, సెక్టోరల్ అధికారులు, డి.ఎ.ఓ. జోత్స్న, ఎన్నికల అధికారి సనత్, సీనియర్ అసిస్టెంట్ శ్రీహరి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మంచిర్యాలలో పెరుగుతున్న అక్రమ కట్టడాలు

మొదటి పేజీ తరువాయి..

నిత్యం రద్దీగా ఉండే మార్కెట్ ఏరియాలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల స్థలం కూడా ఆక్రమణకు గురైంది. పాఠశాల ముందున్న ఖాళీ స్థలంలో రాత్రికిరాత్రే షట్టర్లు వెలిశాయి. వీటిని ఎవరి అనుమతితో వేశారు..? ఇక్కడ రాత్రికి రాత్రే షెట్టర్లు వేసిందెవరు..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. పట్టణంలో కబ్జాల పర్వం నిరాటంకంగా కొనసాగుతున్నప్పటికీ మున్సిపల్ పాలకవర్గం, అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించే విధంగా స్థానిక అధికారులు సరైన దిశగా చర్యలు చేపట్టకపోవడంతో పాటు, కబ్జాకు గురవుతోన్న స్థలాల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు, పాలకవర్గం స్పందించి కబ్జాలను అరికట్టడంతో పాటు ఇప్పటి వరకు ఆక్రమణకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## బిజెపికి సోమారపు సత్యనారాయణ రాజీనామా

గోదావరిఖని, సెప్టెంబర్ 30 (మనం న్యూస్)ః రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. శనివారం గోదావరిఖని శివాజీ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో తమకు పని చేయాలని ఉత్సాహం ఉన్నా సన్నిహితులు, అనుచరులు,కార్యకర్తలు అభిప్రాయం మేరకు బిజెపి పార్టీకి రాజీనామా చేసి, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే తమ ప్రధాన ఏజెండాగా పోటీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.రామగుండం నియోజకవర్గం నుండి చివరిగా ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని,నియోజకవర్గంలోని ప్రజలు తమను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ జాలి రాజమణి,సోమారపు అరుణ్ కుమార్,పిడుగు కృష్ణ,వడ్లూరి రవి, మంచి కట్ల బిక్షపతి,కోదాటి ప్రవీణ్,కుసుమ కుమారి, మాడ నారాయణరెడ్డి, డేవిడ్ రాజు,మామిడాల చంద్రయ్య,దామోదర్, రాజలింగు, సంజీవ్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికుని ఆత్మహత్య

మంచిర్యాల, సెప్టెంబర్ 30 (మనం న్యూస్): మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్‌లోని సిఆర్ఆర్ క్యాంపులో పనిచేస్తున్న వీరస్వామి గౌడ్ అనే కాంట్రాక్టు కార్మికుడు శనివారం ఉదయం క్యాంపులో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ ఘటనా స్థలానికి





వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ విధుల్లోకి తీసుకోలేదనే మనస్థాపంతోనే వీరస్వామిగౌడ్ ఆత్మహత్య చేసుకున్నారన్నారు. దీనికి కాంట్రాక్టర్, యాజ మాన్యమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేసారు. కార్మికులకు కాంట్రాక్టర్ గ్రూప్ ఇన్సూరెన్సు సౌకర్యం చేయించ లేదని, కనీస సౌకర్యలు కూడా కార్మికులకు కల్పించకుండా, కార్మికులను శ్రమదోపిడీ చేస్తున్నారని జీతాలు కూడా సరిగా చెల్లించకుండా మనోవే దనకు గురిచేస్తున్నారన్నారు. మృతుని కుటుంబాన్ని సింగరేణి యాజ మాన్యం , కాంట్రాక్టర్ అన్ని రకాలుగా ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## ఎంఐఎం తాటాకు చప్పుళ్లకు బిజెపి భయపడదు

### బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవీన్

మెట్‌పల్లి, సెప్టెంబర్ 30 (మనం న్యూస్)ః ఎంఐఎం తాటాకు చప్పుళ్ళకు భారతీయ జనతా పార్టీ భయపడదని బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్ వ్యాఖ్యానించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ ఇంటి ముందు ఎంఐఎం గుండాలు చేసిన అలజడికి బండి సంజయ్



భయపడరన్నారు. మజ్లిస్ పార్టీ కావాలని చెప్పి సంజయ్ ఇంటిముందు అలజడి సృష్టిస్తే బిజెపి నేతలు చూస్తూ ఊరుకోరని నవీన్ పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ ఉగ్రవాద గుండాలకు కమ్యూనిస్టు గుండాల తుపాకి తూటాలకు అదరకుండా బెదరకుండా దేశం ధర్మం సురక్షంగా ఉండాలని నమ్మిన సిద్ధాంతం బిజెపిదన్నారు. జాతీయ వాదం కోసం ప్రాణాలు ప్రాణంగా పెట్టి క్రమశిక్షణ గల పార్టీ అయిన బిజెపిలో ప్రతి క్షణం ప్రతి కణం భరతమాతకి సమర్పణమన్నారు. కోట్లాదిమంది కార్యకర్తలు నిర్మాణం చేసుకున్న పార్టీ బిజెపి అని, దేశద్రోహులను ప్రోత్సహిస్తూ ఈ దేశంలో అలజడి సృష్టించడానికి విదేశీయులతో సంబంధాలు పెట్టుకున్నది ఎంఐఎం పార్టీ అని ఆరోపించారు.

## ఆధార్ ప్రామాణికరణతో రైతులకు కనీస మద్దతు ధర

### జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్

కొమురంభీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 30 (మనం న్యూస్)ః ఆధార్ ప్రామాణికరణతోనే రైతులు తమ పంటలను విక్రయించి, ప్రభుత్వం నిర్ణయించిన మద్ధతు ధర పొందేందుకు అవకాశముంటుందని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ ప్రామాణికరణ కొరకు పత్తి పంట కొనుగోలు కేంద్రంలో కావలసిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు, ఏదైనా కారణం వలన వేలిముద్ర ప్రామాణికరణ విఫలం అయితే, కంటి స్కాన్, ముఖ ప్రామాణికరణ, ఓ. టి. పి. ద్వారా, ఆధార్ కార్డు పై ముద్రించబడిన క్యూఆర్ కోడ్ ద్వారా ఆధార్ ప్రామాణికరణ అందించవచ్చని తెలిపారు. ఆధార్ ప్రామాణికరణ జరిగిన తర్వాత మాత్రమే పత్తి పంట కొనుగోలు ప్రక్రియ మొదలవుతుందని, ఆధార్ ప్రామాణికరణ జరుగని పక్షంలో పత్తి పంట కొనుగోలు చేయడం జరగదని తెలిపారు. ఆధార్ ప్రామాణికరణ అనంతరం పత్తి పంట కొనుగోలు ప్రక్రియ ముగిసిన తరువాత ఆధార్ తో అనుసంధానం చేయబడిన బ్యాంకు ఖాతాలో సంబంధిత నగదు జమ చేయడం జరుగుతుందని, రైతులు బ్యాంకు ఖాతాను ఆధార్ తో అనుసంధానం చేసుకోవాలని తెలిపారు.

# రామగుండంలో ఎగిరేది గులాబీ జెండా

### ఎమ్మెల్యే చందర్ వెంటే రామగుండం ప్రజలు

### రామగుండం దశాబ్ది ప్రగతి సభను

### విజయవంతం చేయాలని నాయకుల పిలుపు

గోదావరిఖని, సెప్టెంబర్ 30 (మనం న్యూస్): రామగుండం నియోజక వర్గంలో ఎగిరేది గులాబీ జెండా అని బిఆర్ఎస్ నియోజకవర్గం అధికార ప్రతి నిధులు మాదాసు రామమూర్తి, పర్లపెల్లి రవి ధీమా వ్యక్తం చేశారు. శనివారం గోదావరిఖని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో అక్టోబర్ 1న రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేపట్టనున్న రామగుండం దశాబ్ది ప్రగతి సభకు కేటీఆర్ వస్తున్న నేపథ్యంలో వేలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 2014 నుంచి రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన ప్రగతిని కేటీఆర్ ప్రజలకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి,రాబోయే కాలంలో జరిగే అభివృద్ధిని వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ, గృహలక్ష్మి తదితర పథకాల ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఐటి ఇండస్ట్రియల్ పార్కులతో స్థానిక యువతకు ఉపాధి అవకాశం చేకూరుతుందన్నారు. సింగరేణిని నిర్వీర్యం చేయడానికి కుట్రపూరిత ఆలోచనలు చేయగా, ఎమ్మెల్యే చందర్ బాయి బాటతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిందని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం నిత్యం పరితపిస్తున్న ఆయనపై కొంతమంది బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, ఎవరు ఏమి చేసినా రామగుండం నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురుతుందని,




భారీ మెజార్టీతో బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడుతుందని, మరల సీఎంగా కేసీఆర్ ఎన్నికై, హ్యాట్రిక్ సీఎంగా చరిత్రలో నిలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధికి సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ గా బిఆర్ఎస్ ప్రభుత్వం నిలుస్తుందని, ఎన్ని ఆటంకాలు,అడ్డంకులు సృష్టించిన ప్రజాసేవకే తన జీవితం అంకితం చేసిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వెంటే ప్రజలు ఉంటారని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు పిల్లి రమేష్, దొమ్మేటి వాసు, చల్ల రవీందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస్, జడ్సన్ రాజ్, అక్షర మల్లేష్, హామీద్, ఈదునూరి శ్రీకాంత్, ఈదునూరి కిరణ్, కంది చంద్రయ్య, ఇరుగురాల శ్రావణ్, పిడుగు కుమార్, భాను ప్రసాద్, సాగర్, మహేందర్, యశ్వంత్, కిరణ్ , రంజిత్, సత్తార్, సంతోష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాజీపేట పాఠశాల విద్యార్థికి పేటెంట్ హక్కులు

### అభినందించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల అర్బన్, సెప్టెంబర్ 30 (మనం న్యూస్)ః జాతీయస్థాయిలో ఇన్‌స్పైర్ మానక్ 2019 సంవత్సరంలో మూడవ స్థానం పొందిన జడ్పిహెచ్‌ఎస్ హనుమాజిపేట విద్యార్థి మరిపెల్లి అభిషేక్ తయారుచేసిన ప్యాడి ఫిల్లింగ్ మిషన్ కు భారత ప్రభుత్వంచే తన తండ్రి లక్ష్మీరాజ్యం పేరిట పేటెంట్ హక్కులు పొందారు. 2019 ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌లో భాగంగా ఈ ప్రాజెక్ట్‌కు జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించి, వరంగల్‌లోని మడికొండలో జరిగిన రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్లో మెరిట్ సాధించి జాతీయస్థాయిలో ఐఐటి ఢిల్లీలో నిర్వహించిన ఎగ్జిబిషన్లో మూడవ స్థానం లభించడం జరిగింది. తన యొక్క తండ్రి ఐకెపి సెంటర్లలో ధాన్యం నింపునప్పుడు పరిశీలించిన అతను ధాన్యాన్ని సంచులలో నింపడానికి ఈజీగా ఉండే విధంగా ఈ ఎగ్జిబిట్ ను తయారు చేశారు. ఈ విజయం సాధించిన తర్వాత తాను ఎన్ఐటి వరంగల్లో నెలరోజులపాటు రోబోటిక్స్ పై ట్రైనింగ్ తీసుకున్నాడు. గుజరాత్లోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన ఫైన్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. ఫైన్ ఆధ్వర్యంలో నిర్వహించే సకూర జపాన్ ప్రోగ్రాం కూడా ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థిని కలెక్టర్ అనురాగ్ జయంతి, డీఈవో రమేష్, పాఠశాల



ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ రావు, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జంకేమల్లేశం, సర్పంచ్ జంకే విజయ శ్రీనివాస్ రెడ్డి, గైడ్ టీచర్ కోరెం వెంకటేశం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

### తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలే

# స్వేచ్ఛా వాయువుల్ని ప్రసాదించాయి

### తపాలా శాఖ సూపరింటెండెంట్ శివాజీ

### సాయుధ పోరాట వీరుల కుటుంబసభ్యులకు ఘన సన్మానం

చిగురుమామిడి, సెప్టెంబర్ 30 (మనం న్యూస్)ః తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాల ఫలితంగానే నేడు సంతోషంగా స్వేచ్ఛగా జీవిస్తున్నామని కరీంనగర్ పోస్టల్ సూపరింటెండెంట్ శివాజీ తెలిపారు. అజాది కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న మేరీ మిట్టి – మేరా దేశ్ కార్యక్రమం సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న మండలంలోని ఒగులాపూర్ గ్రామానికి చెందిన బద్దం రాజిరెడ్డి, ఏలేటి మల్లారెడ్డి కుటుంబ సభ్యులు అంజారెడ్డి, వెంకట్ రెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోస్టల్ డిపార్ట్మెంట్ సూపర్డెంట్ శివాజీ మాట్లాడుతూ ఒగులాపూర్ గ్రామంలో వారి ఇంటి పరిసరాల్లో మట్టిని సేకరించి ఢిల్లీలో స్థూపం నిర్మాణం కోసం పంపిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణా స్వాతంత్ర్య సమరయోధులు చేసిన పోరాటాలు,వారు చేసిన త్యాగాలు స్మరించుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులను స్మరిస్తూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఆ గ్రామ సర్పంచ్ బోయిని శ్రీనివాస్, ఉపసర్పంచ్



కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.అనంతరం వారిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయిని శ్రీనివాస్,ఉప సర్పంచ్ కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,పోస్టల్ సిబ్బంది కాల్వ రాజు,భూపతి జగన్ రెడ్డి, అరవింద్,సాయి తదితరులు పాల్గొన్నారు.

# బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించిన సింగరేణి యాజమాన్యం



మంచిర్యాల, సెప్టెంబర్ 30 (మనం న్యూస్ ): సింగరేణి లో 2వేల266 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తూ సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు చైర్మన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం పర్సనల్, ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్.బలరాం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2017 నుంచి ఇప్పటి వరకు 13,981 మంది జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజేషన్ చేసారు. ఏడాదిలో భూ గర్భ గనుల్లో కనీసం 190 రోజులు పనిచేసిన వారికి, ఉపరితల గనులు, విభాగాల్లో కనీసం 240 రోజులు పనిచేసిన బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది సెప్టెంబరు 1 తేదీ నుంచి జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తున్నట్లు ఆదేశాలిచ్చారు. గతంలో బదిలీ వర్కర్లుగా ఉద్యోగంలో చేరిన కార్మికులు జనరల్ మజ్దూర్లుగా గుర్తింపు రావడానికి కనీస మస్టర్లు ఉన్నప్పటికీ ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు 2017 నుంచి ఎప్పటికప్పుడు జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తూ వస్తున్నారు. తొలిసారిగా 2017 అక్టోబరులో ఒకే దఫా 2718 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా గుర్తించడం జరిగింది . డిసెంబరు 31, 2022 కు ముందు సంస్థలో బదిలీ వర్కర్లుగా చేరిన వారిలో కనీసం 190 భూగర్భ గనుల్లో, ఉపరితల గనులలో 240మస్టర్ల అర్హత కలిగిన వారందరికీ ఇప్పుడు జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిం డం జరిగింది. దీంతో 2017నుంచి ఇప్పటి వరకు జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజ్ అయిన వారి సంఖ్య 13, 981కి చేరింది .సింగరేణిలో కారుణ్య, డిపెండెంట్ ప్రక్రియలో ఉద్యోగంలో చేరిన ప్రతీ ఒక్కరినీ తొలుత బదిలీ వర్కర్లుగా సంస్థ నియమిస్తుంది. ఏడాది కాలం పనిచేసిన అనంతరం కనీస హాజర్లు ఉన్న వారిని మాత్రమే జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తుంది. నాటి నుంచి మాత్రమే వారు పూర్తి స్థాయి కంపెనీ ఉద్యోగులుగా గుర్తించబడతారు. దీనిద్వారా పదోన్నతులు పొందడానికి వీలు కలుగుతుంది. కారుణ్య నియామక ప్రక్రియలో సింగరేణి లో చేరిన దాదాపు 16 వేల మంది వారసులలో ఎక్కువ మంది మంచి విద్యార్హతలు కలిగి ఉన్నారు. ఇటువంటి వారు జనరల్ మజ్దూర్లుగా గుర్తింపు పొందటం వల్ల కంపెనీ తరచూ నిర్వహించే ఇంటర్నల్ పరీక్షల్లో తమ విద్యార్హతలకు తగిన ఉద్యోగాలను పొందే సదవకాశం ఏర్పడుతుంది.

**:క్రమశిక్షణతో పనిచేసే వారికే మంచి గుర్తింపు: డైరెక్టర్ ఎన్.బలరామ్...**

సింగరేణి లో ఉద్యోగం రావడం ఒక వరంగా భావించాలని, ఆ విధంగా క్రమశిక్షణతో విధులకు హాజరవుతూ కనీస మస్టర్లు సాధించిన అందరినీ జనరల్ మజ్దూర్లుగా గుర్తించడం జరిగిందని పర్సనల్, ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్.బలరామ్ తెలిపారు. ఈ సందర్భంగా వారందరికీ అభినందనలు తెలిపారు. సింగరేణి లో బాగా పనిచేసే వారికి ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందని, గతంలో జనరల్ మజ్దూర్లుగా ఎంపికైన అనేక మంది మరింత శ్రద్ధగా పనిచేస్తూ కంపెనీ నిర్వహించిన ఇంటర్నల్ పరీక్షల్లో పాల్గొని పదోన్నతులు సాధించారని గుర్తు చేశారు. ప్రతీ ఒక్కరూ విధుల పట్ల అంకిత భావంతో పనిచేయాలని, సంస్థ ఉన్నతితో పాటు మంచి లాభాలు, ఇన్సెంటివ్‌లు అందుకోవాలని పిలుపునిచ్చారు. మొత్తం 2266 మందిలో

677 మంది శ్రీరాంపూర్ ఏరియా లో, 522 మంది ఆర్జీ-1 ఏరియాలో , 323 మంది ఆర్జీ-3, అడ్రియాల ప్రాజెక్టు నుంచి, 274 మంది భూపాల పల్లి లో , 261 మంది మందమర్రి లో , 79 మంది మణుగూరు లో , 51 మంది రామగుండం -2 లో , 32 మంది బెల్లంపల్లి ఏరియా లో , 19 మంది చొప్పున ఇల్లందు, కార్పోరేట్ నుంచి 9 మంది, కొత్తగూడెం నుంచి రెగ్యులరైజ్ అయ్యారని బలరాం తెలిపారు.

# ఎంఐఎం కార్యకర్తల తీరు అమానుషం

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి



చిగురుమామిడి, సెప్టెంబర్ 30 (మనం న్యూస్): కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కార్యాలయం ముందు ఎంఐఎం కార్యకర్తలు వీరంగం సృష్టించి, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం అమానుషమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అన్నారు. శనివారం ఆయన 'మనం'తో మాట్లాడుతూ తాటాకు చప్పుళ్లకు బిజెపి భయపడదని, ఎంఐఎం దుందుడుకు చర్యలకు పాల్పడుతుందని, రాష్ట్ర ప్రభుత్వ మద్ధతుతోనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆరోపించారు. కెసిఆర్ ప్రభుత్వం అండదండలతోనే ఎంఐఎం శ్రేణులు రెచ్చిపోతున్నాయని, వారి ఆగడాలు శృతిమించుతున్నాయన్నారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఉమ్మడి రాష్టంలో లేని ఎంఐఎం ఆగడాలు నేడు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్టంలో ఎందుకు కొనసాగుతున్నాయో ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. మత ఘర్షణలను పెంచి పోషిస్తోన్న బిఆర్ఎస్ అధికార అహంకారానికి ఈ ఘటన నిలువెత్తు నిదర్శనమన్నారు. బిజెపి అధికారంలోకి వస్తుందనే భయంతో బిఆర్ఎస్, ఎంఐఎంలు కలిసి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని శ్రీరామ్ చక్రవర్తి వ్యాఖ్యానించారు. బిజెపి అధికారంలోకి రాగానే బిఆర్ఎస్‌కు మోకరిల్లే వారికి తొత్తులుగా ఉండే దుండగులపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఎంపి కార్యాలయం పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

## ఒబిసి మోర్చా జిల్లా కార్యదర్శి లక్ష్మణ్



తిమ్మాపూర్, సెప్టెంబర్ 30 (మనం న్యూస్): కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఒబిసి మోర్చా జిల్లా కార్యదర్శి ఎర్రోజు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఎంపీ కార్యాలయం పై దాడి ఘటనకు నిరసనగా శనివారం తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్ రాజీవ్ రహదారి పై బీజేపీ కార్యకర్తలు ఎంఐఎం దిష్టి బొమ్మను దహనం చేసారు. కరీంనగర్ లో బీజేపీ ఎదగకుండా బిఆర్ఎస్, ఎంఐఎం లు కలిసి ఆడుతున్న నాటకమే దాడులకు కారణమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శు లు కిన్నెర అనిల్, గొట్టుముక్కల తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి, బిజెవైఎం ప్రధాన కార్యదర్శి బొడ్డు అశోక్, కార్యదర్శి పడాల శ్రీనివాస్, దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి గాజుల అజయ్, బుర్ర శ్రీనివాస్, మాదిరెడ్డీ ప్రదీప్, బొడ్డు శ్రీనివాస్, రొంటాల జీవన్ రెడ్డి, కీసరి సంపత్, రేగూరి సుగుణా కర్, తదితరులు పాల్గొన్నారు.

# నీరా కేఫ్ బిడ్డింగ్ ప్రక్రియను ఉపసంహరించాలి

## కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ తిరుపతి గౌడ్



చిగురుమామిడి, సెప్టెంబర్ 30 (మనం న్యూస్): గీత కార్మికులకు నష్టం కలిగించే విధంగా ఉన్న నీరా కేఫ్ టెండర్ విధాన ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ తాళ్లపల్లి తిరుపతి గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిడ్డింగ్ ప్రక్రియను నిలిపివేసి, నీరా కేఫ్ బాధ్యతలను టాడి కార్పొరేషన్‌కు అప్పగించాలన్నారు. టాడి కార్పొరేషన్ ద్వారా గీత కార్మికుల ఉపాధి మెరుగవుతుందన్నారు. నీరా కేఫ్ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తే వారు కేవలం లాభాల కోసమే తాపత్రాయపతారన్నారు. ఆరోగ్యకరమైన నీరాను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్న ప్రభుత్వ లక్ష్యం దీంతో నీరుగారిపోయే ప్రమాదముందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సమాలోచనలు జరిపి బిడ్డింగ్ ప్రక్రియను నిలిపివేసి, టాడి కార్పొరేషన్‌కు బాధ్యతలు అప్పగించాలని తిరుపతిగౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, యూత్ మండల అధ్యక్షులు ముంజ ప్రకాష్ గౌడ్, నాయకులు తాళ్లపల్లి భాస్కర్ గౌడ్, కక్కర్ల రమేష్ గౌడ్, పచ్చిమట్ల రాజ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ..

## హీల్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో 'బాంచన్ ఆసరా' దీక్ష



మంచిర్యాల, సెప్టెంబర్ 30 (మనం న్యూస్): రాష్ట్రంలోని దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హీల్ స్వచ్ఛంధ సంస్థ, బిసి రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా వద్ద బాంచన్ ఆసరా పేరిట శనివారం ఒక రోజు దీక్షను నిర్వహించారు. బిసి ఉద్యమ నాయకులు డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్ నాయకత్వంలో జరిగిన దీక్షా కార్యక్రమంలో జిల్లాలోని దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, డాక్టర్ రమణ, బిసి నాయకులు కర్రే లచ్చన్న, బిజెపి నాయకులు తుల మధుసూదన్ రావు, బిఎస్పీ నాయకురాలు భవాని, బిసి జాగృతి నాయకుడు నరెండ్ల శ్రీనివాస్, బిసి వేదిక నాయకులు రంగు రాజేశం, బండి రాజలింగు, తోట రామయ్య, శేఖర్ రాజు, వైద్య భాస్కర్, సదానందం తదితర నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి, సంఘీభావాన్ని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. దివ్యాంగులకు గతంలో ఐదు వందల రూపాయల పెన్షన్ ఉన్న సమయంలో అరకొర డాక్టర్‌లతో నెలకు కనీసం రెండు వేల మందికి పరీక్షలు చేసి వైకల్య నిర్ధారణ చేసేవారని, కానీ ఇపుడు నాలుగు వేల పెన్షన్ ఆశ చూపిస్తూ, స్లాట్ బుకింగ్ పేరిట కనీసం రెండు వందల మందిని కూడా పరీక్షించడం లేదన్నారు. అంతే కాకుండా పాత కార్డులను కూడా పునరుద్ధరించకపోవడంతో అనేక మంది ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. దివ్యాంగులు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు మానవతా ధృక్పధంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘ నాయకులు మహేందర్, చంద్ర మౌళి, సత్తన్న, సుజాత, రమేష్‌తో పాటు జిల్లాలోని దివ్యాంగులు పాల్గొన్నారు.

# రసమయి సమక్షంలో బిఆర్ఎస్‌లో భారీ చేరికలు



తిమ్మాపూర్, సెప్టెంబర్ 30 (మనం న్యూస్): తిమ్మాపూర్ మండలం పోరండ్ల, మహాత్మానగర్, మొగిలిపాలెం, తిమ్మాపూర్ గ్రామాల్లోని కాంగ్రెస్, బిజెపి లకు చెందిన సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలు శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, తిమ్మాపూర్ మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ రావుల రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి, మాతంగి లక్ష్మణ్ లతో ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కేసు నమోదు చేశాం

**- పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపైనా చట్టరీత్యా చర్యలు చేపడతాం**

**- అకారణంగా రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తే ఉపేక్షించేది లేదు**

**: కరీంనగర్ సిపి సుబ్బారాయుడు**



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 30 (మనం న్యూస్)ః మిలాద్ ఉన్ నబి పండుగ కోసం శుక్రవారం నిర్వహించిన ర్యాలీకి స్థానిక మర్కజీ మిలాద్ కమిటీ విజ్ఞప్తి మేరకు పోలీసు శాఖ అనుమతినిచ్చిందని, కానీ ర్యాలీలో పాల్గొన్న కొందరు యువకులు పరిమితులను అతిక్రమించి ఒక గుంపుగా ఏర్పడి పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారని పోలీసు కమిషనర్ సుబ్బారాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగానే కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కార్యాలయమున్న వీధిలో ర్యాలీ నిర్వహించారని పేర్కొన్నారు. ఈ సంఘటన గురించి బిజెపికి చెందిన కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తక్షణమే స్పందించి విచారణ చేపట్టామని సిపి తెలిపారు. ఆ ప్రదేశంలో ఉన్న ప్రత్యక్ష సాక్షులతో పాటు సిసి కెమెరాలను కూడా పరిశీలించినట్లు తెలిపారు. పలువురు యువకులు గుంపుగా ఆ వీధి గుండా వెళ్లారని, దాడి చేసినట్లుగా ఇప్పటివరకు ఎటువంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. ఇచ్చిన రూట్ మ్యాప్‌లో కాకుండా అనుమతి పరిమితులు అతిక్రమించి గుంపుగా ఏర్పడి ర్యాలీగా తిరిగిన 15 మంది యువకులను గుర్తించి వారిపై కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేశామని ఇంకా విచారణ కొనసాగుతుందని వివరించారు. వారి వాహనాలను కూడా సీజ్ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. సంఘటన జరిగిందని తెలిసిన వెంటనే బిజేపి కార్యాలయం వద్దకు చేరుకున్న పోలీసులు బాధ్యులని గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపినా వినకుండా ఆఫీసులోని వ్యక్తులు, కార్యకర్తలు నిరసనగా, గుంపుగా ఏర్పడి చేతుల్లో కర్రలు తీసుకుని రోడ్లపై వచ్చి ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే చర్యలకు పాల్పడ్డారని సిపి పేర్కొన్నారు. అక్కడున్న పోలీసు వారితో దురుసుగా ప్రవర్తించి వాగ్వాదానికి దిగి పోలీస్ విధులకు ఆటకం కలిగించిన వారిని కూడా గుర్తించి భాద్యులపై చట్ట పరంగా కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా నిరాధారమైన ఆరోపణలు చేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిని కుడా గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కరీంనగర్ లోని అన్ని మతాలకు చెందిన ప్రజలు వారి వారి పండుగలను శాంతియుత వాతావరణంలో సోదర భావంతో జరుపుకోవాలని అన్ని వర్గాల మత పెద్దలను పలుమార్లు సమావేశపరచి సూచించామన్నారు. ఏవైనా చిన్న చిన్న సంఘటనలు జరిగినా, ఏదైన వర్గానికి చెందిన వారికి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలని చట్టాన్ని చేతుల్లోకి తీసుకొనే చర్యలకు పాల్పడవద్దని సూచించినట్లు ఆయన తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై, చట్టాన్ని ఉల్లంఘించి వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో మత ఘర్షణలకు దారి తీసే పోస్టులు పెట్టడం, దుష్ప్రచారాలు చేసే ఎంతటి వారైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ప్రజల శాంతి భద్రతలే ముఖ్యమని వాటికి విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల చట్ట పరిధిలో చాలా కఠినంగా వ్యవహరిస్తామని సిపి తెలిపారు.

# ఘనంగా ఎమ్మెల్యే సతీష్‌కుమార్ జన్మదిన వేడుకలు



చిగురుమామిడి, సెప్టెంబర్ 30 (మనం న్యూస్)ః హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ 58వ జన్మదినోత్సవ వేడుకలను బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ కట్ చేసి, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జనం మెచ్చిన నాయకుడి జన్మదిన వేడుకలలో పాల్గొనడం చాలా సంతోషకరంగా భావిస్తున్నానన్నారు. ప్రజల చేత మంచి నాయకుడిగా గుర్తింపు పొందిన సతీష్ కుమార్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉంటూ, హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని రానున్న ఎన్నికల్లో ముచ్చటగామూడవసారి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి పదవి చేపట్టి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పరచాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణరెడ్డి, రైతు బంధు సమితి అధ్యక్షులు పెనుకుల తిరుపతి, అఈ వైస్ చైర్మన్ రామోజు రజిత కృష్ణమాచారి, జిల్లా రైతు బంధు సమితి సభ్యులు సాంబారి కొమురయ్య, వైస్ ఎంపిపి బేతి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మంకు శ్రీనివాస్ రెడ్డి,ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు,ఆర్గనైజింగ్ కార్యదర్శులు కలువల రాజేశ్వర్ రెడ్డి, ముక్కెర సదానందం, చెప్యాల శ్రీనివాస్, ఒంటెల కిషన్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు అనుమాండ్ల సత్యనారాయణ, మైనారిటీ సెల్ అధ్యక్షులు సర్వర్ పాషా, మహిళా అధ్యక్షురాలు అందె సుజాత,సోషల్ మీడియా అధ్యక్షులు బొట్ల రవీందర్,యువజన నాయకులు తాటికొండ సందీప్ రెడ్డి,సింగిల్ విండో వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి, మాజీ ఎంపిపి ఆకవరం మతం భవాని,గ్రామ శాఖ అధ్యక్షులు ఆకవరం మతం శివప్రసాద్,గీట్ల తిరుపతి రెడ్డి,ఎస్ కే సిరాజ్, బుర్ర తిరుపతి గౌడ్,పిల్లి వేణు,కొమ్ము కొమురయ్య, కొమ్ము కొమురయ్య, సంపత్ రెడ్డి, బిల్లా వెంకట్ రెడ్డి,యాళ్ల జనార్ధన్ రెడ్డి,సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు జక్కుల రవీందర్, సర్పంచ్లు బెజ్జంకి లక్ష్మణ్,ముప్పిడి నర్సింహా రెడ్డి,సుద్దాల ప్రవీణ్,బోయిని శ్రీనివాస్,మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆరవ రోజుకు చేరిన ఆశ వర్కర్ల సమ్మె

## చెవిలో పువ్వులు పెట్టుకుని ఆశా వర్కర్ల నిరసన

సిరిసిల్ల అర్బన్, సెప్టెంబర్ 30 (మనం న్యూస్)ః తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆశ వర్కర్లు చేస్తున్న సమ్మె శనివారానికి ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో ఆశా వర్కర్లు, రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు ఆశ వర్కర్ల చెవిలో పూలు పెట్టే విధంగా మాట్లాడిన వ్యాఖ్యలను నిరసిస్తూ చెవిలో పూలు పెట్టుకొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు దేశంలో ఎక్కడా లేనివిధంగా వేతనాలు ఇస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ఆశా వర్కర్లతో వెట్టి చాకిరి చేయించుకోవడం జరుగుతుందని పారితోషకాలు లేని పనులను , సర్వేలను కూడా చేయిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో ఎమ్మెల్యేలు మంత్రులు, ముఖ్యమంత్రి ఎక్కువ వేతనాలు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని, అవసరమైతే ప్రగతి భవన్ ముట్టడిస్తామన్నారు. ఈ రోజు సమ్మెకు తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నల్దాస్ గణేష్ , ఎమ్మార్పీఎస్ నాయకులు థామస్ , లక్ష్మణ్ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల , గౌరవాధ్యక్షులు భారతి కార్యదర్శి జయశీల, గాయత్రి, కస్తూరి, రేణుక, చంద్రకళ, హెప్సి, లావణ్య, వనిత, రజిత, స్వప్న, మమత, పద్మ, రుక్మిణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## హస్తం గూటికి చేరిన బిఆర్ఎస్ నాయకులు



జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 30 (మనం న్యూస్)ః బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్తూరి సాగర్, లింగంపల్లి లింగారావు బిఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పి హస్తం గూటికి చేరారు. హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూని వెంకట్ సమక్షంలో జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని సీనియర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కొత్తూరి సాగర్ లింగంపల్లి లింగారావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కొత్తూరి సాగర్, లింగంపల్లి లింగారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమ వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వెంకట్ గెలుపు కోసం శ్రమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న, జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ఆశ వర్కర్ల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి

### సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు

మెట్ పల్లి, సెప్టెంబర్ 30 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించి డిమాండ్లు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శనివారం పట్టణంలో సమ్మె చేస్తున్న ఆశ వర్కర్ల దీక్ష శిబిరానికి వచ్చి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ వేతనంతో ఎక్కువ సేవలందిస్తున్న ఆశ వర్కర్ల డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు కనీసం నెలకు 18 వేల రూపాయల వేతనం ఇవ్వాలని అలాగే ఐదు లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈఎస్ఐ సదుపాయం కూడా కల్పించాలని సమ్మె చేస్తున్న ఆశ వర్కర్ల డిమాండ్ తక్షణం నెరవేర్చాలని కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, అల్లూరి మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, అందే మారుతి, మహిళా అధ్యక్షురాలు భవితరాణి జెట్టి లక్ష్మణ్ , సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 30 వరకు పోలీసు ఆక్ట్ అమలు

### అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు

కొమురంభీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 30 (మనం న్యూస్): శాంతి భద్రతల దృష్ట్యా జిల్లాలో ప్రశాంతతను పెంపొందించేందుకు అక్టోబర్ 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉంటుందని అదనపు ఎస్పీ అచ్చేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, పోలీస్ ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరానికి పురిగొల్పే ఎలాంటి ఆయుధాలు వినియోగించడం నిషేధమని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్‌లు, జనసమూహం పోగవుట, రాళ్లను జమ చేయుట, ధరించి సంచరించుట, లౌడ్ స్పీకర్‌లు, డీజెల వినియోగం నిషేధించినట్లు ఆయన తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై 30 పోలీస్ ఆక్ట్ 1861 కింద కఠిన చర్యలు తీసుకోనున్నట్లు అచ్చేశ్వర్‌రావు హెచ్చరించారు.

### ప్రభుత్వ పథకాల పంపిణీ పేరిట..

## విద్యాసాగర్‌రావు కుమారునికి ఉచిత ప్రచారం సాగిస్తున్నారు

### కాంగ్రెస్ నిజామాబాద్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ ప్రవీణ్



మెట్ పల్లి, సెప్టెంబర్ 30 (మనం న్యూస్): ప్రభుత్వ ఉచిత పథకాల పంపిణీ పేరుతో బిఆర్ఎస్ అభ్యర్థికి ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంటు కో-ఆర్డినేటర్ ఘోరమంతుల ప్రవీణ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పింఛనుదారులకు కార్డులు పంచ తామంటూ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ కు వేలాది మందిని పిలిపించి కోరుట్ల నియోజకవర్గ బి ఆర్ ఎస్ అభ్యర్థి తన కుమారుడు కల్వకుంట్ల సంజయ్ కు ఓటు వేయాలని పేర్కొన్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆయన లబ్ది కోసం ప్రభుత్వ పథకాలను వాడుకుంటున్నారన్నారు. గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులు సమావేశానికి రాకుంటే పింఛన్ నిలిపివేయిస్తానని భయభ్రాంతులకు గురి చేస్తూ, మీటింగ్‌కు రప్పించి ఎన్నికల ప్రచారాన్ని చేసుకుంటున్నారన్నారు. ఇకనైనా ఇలాంటి ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

# సిఎం ముఖ్య కార్యదర్శిని కలిసిన సింగరేణి పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు



మంచిర్యాల, సెప్టెంబర్ 30 (మనం న్యూస్ ): రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి గతంలో సింగరేణి, కోలిండియా చైర్మన్ గా పని చేసిన ఎస్.నర్సింగ్ రావును తెలంగాణ అంబేద్కర్ సెక్రటేరియట్ లో సింగరేణి రిటైర్డ్ మైన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు శనివారం కలిశారు. కార్మికుల సమస్యల పై మెమోరాండం సమర్పించారు. పెన్షన్ పెరుగుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, దీనికి గాను కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ కూడా రాష్ట్ర ప్రభుత్వం రాయాలని, అసెంబ్లీ లో కూడా తీర్మాణం చేయాలని కోరారు .మెడికల్ కార్డు కోసం రిటైర్డ్ కార్మికుల నుంచి 40వేల రూపాయలను తీసుకుంటున్న సిపిఆర్ఎంఎస్ పథకాన్ని రద్దు చేసి ప్రతి రిటైర్డ్ కార్మికుని అన్ని రకాల ఉచిత అపరిమిత వైద్య సేవలు కల్పించాలని, వసూలు చేసిన మెడికల్ కార్డు నగదును తిరిగి చెల్లించాలని కోరారు. అలాగే సింగరేణి లాభాల వాటలో 10 శాతం రిటైర్డ్ కార్మికులకు కూడా చెల్లించాలని, ఎంజిసి కంపనీలో రిటైర్డ్ కార్మికులకు అమలవుతున్న నగదు పథకాన్ని సింగరేణి రిటైర్ కార్మికులకు కూడా ప్రవేశపెట్టాలని, ఆ కంపనీ లాగే సింగరేణి కూడా లాభాలు గడిస్తుందన్నారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులు అత్యధికంగా నివసిస్తున్న హైదరాబాద్, జమ్మికుంట మొదలైన ప్రాంతాల్లో సింగరేణి మెడికల్ క్యాంప్ లను నిర్వహించి ఉచితంగా నెలవారి మందులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కె.ఆర్.సి.రెడ్డి, ఎం.బాబు రావు, ఏనుగు రవీందర్ రెడ్డి, ఆళవందార్ వేణు మాధవ్, పిటి స్వామి తదితరులున్నారు. సింగరేణి రిటైర్డ్ మైన్స్ పెన్షనర్స్ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు.

# హామీలను నెరవేర్చకుండా వస్తున్న కెటిఆర్‌ను అడ్డుకుంటాం

### చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాల, సెప్టెంబర్ 30 (మనం న్యూస్): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండ ఈ ప్రాంతానికి వస్తున్న కెటిఆర్ పర్యటనను అడ్డుకుంటామని చెన్నూర్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రకటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చిన తర్వాతనే కెటిఆర్ చెన్నూర్ నియోజకవర్గంలో అడుగుపెట్టాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీర్ల సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఖలీల్, చెన్నూర్ పట్టణ అధ్యక్షులు చెన్న సూర్యనారాయణ.కాంగ్రెస్ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు ఈర్ల నారాయణ చెన్నూర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు జనగామ శ్రీనివాస్. రమేష్ దొబ్బల సంపత్ లు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ కాళేశ్వరం బ్యాక్ వాటర్ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని, చెన్నూర్ రెవిన్యూ డివిజన్ ను చెయ్యలేదన్నారు .పేదలకు డబుల్ బెడ్ రూమ్స్ ఇవ్వకుండా, నియోజకవర్గంలో రెండు మండలాలు చేస్తా అని చెయ్యకుండా, చెన్నూర్ కొత్త బస్టాండ్ నుండి పాత బస్టాండ్ వరకు రోడ్డు వెడల్పులో దుకాణాలు కోల్పోయిన చిరు వ్యాపారులకు పునరావాసం కల్పించకుండా ,నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తా అని కల్పించకుండా, పోడు భూములు చేసుకుంటున్న రైతాంగానికి పట్టాలు కొంతమందికి ఇచ్చి మిగితా వారికివ్వకుండా చేస్తున్న పర్యటనను అడ్డుకుంటామని ప్రకటించారు.



# భరించేవాడే భర్త ... భార్యను ఇంటి నుండి బయటకునెట్టిన భర్త

### ఆందోళనకు దిగిన బాధితురాలు

వీణవంక- సెప్టెంబర్30 (మనంన్యూస్): భరించేవాడే భర్త అంటారు కాని భార్యను, పిల్లలను ఇంట్లో నుండి వెళ్లగొట్టి ఇంటికి తాళం వేసిన ఘటన శనివారం మండలంలోని బేతిగల్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కంబాల కుమారస్వామి-పద్మ లకు ఒక కుమార్తె, ఒక కుమారుడు సంతానం. గత కొన్ని నెలలుగా తన భర్తకు తనకు గొడవ జరుగుతుందని, గొడవకు కారణం అతను ఓ అక్రమ సంబంధం పెట్టుకొని తనను తన కూతురును వేధిస్తున్నాడని, గతంలో ఈ గొడవలపై పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయగా పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చినా కూడా తన తీరు మారకపోవడంతో తన తల్లిగారింటికి వెళ్లానని అన్నారు. గత మే నెల నుండి తన భర్త వేరుగా హుజురాబాద్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాడని, ఈ నెల 27న తన తల్లి ఇంటి నుండి బేతిగల్ గ్రామంలో ఉన్న తన ఇంటికి రావడం జరిగిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న తన భర్త ఇంటికి వచ్చి నా ఇంట్లో ఉండవద్దని ఇంటికి తాళం వేసాడని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. నాలుగురోజులుగా ఇంటి ముందు వరండాలోనే ఉంటున్నామని, హోటల్‌నుండి భోజనం తెచ్చుకుంటున్నామని తెలిపింది. 100కు డయల్ చేయగా పోలీసులు వచ్చి పోలీస్‌స్టేషన్‌కు బాధితులను తరలించారు. ఈ సమస్యను కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని ఎస్సై తెలిపినట్లు బాధితురాలు తెలిపారు. తన బిడ్డకు తనకు న్యాయం చేయాలని కోరారు.